క్లుప్తంగా

ఆత్మకూరులో యోగివేమన దూర విద్యా కేంద్రం

ఆత్మకూరు: యోగి వేమన యూనివర్సిటీ దూర విద్య (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) కేంద్రం ఆత్మకూరు పట్టణంలోని షిరిడీ సాయిరామ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు కళాశాల నిర్వాహకులు కేఎస్ రాజు శనివారం తెలిపారు. యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో నిర్వహించే ఈ కేంద్రంలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతో పాటు ఎంఏలో ఇంగ్లిషు, తెలుగు, హిస్టరీతో పాటు పలు కోర్సులు చేసేందుకు అవకాశం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా గంగమ్మ జాతర


గంగమ్మ తల్లి

చేజర్ల: చేజర్ల గ్రామదేవత గంగమ్మ తల్లి జాతర వైభవంగా జరుగుతోంది. అందులో భాగంగా శనివారం గంగమ్మ పెట్టెను తీసుకెళ్లి పెన్నానదిలో జలాధివాసం చేయించారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం మేళతాళాల మధ్య మహిళలు నైవేద్యాలు తీసుకెళ్లి గంగమ్మ తల్లికి మొక్కులు తీర్చుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

కుల గణనపై శిక్షణా తరగతులు

జలదంకి: ఈ నెల 20, 21 తేదీల్లో కులగణన సర్వేపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లుకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బత్తిన సింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణన సర్వే పర్యవేక్షణకు సచివాలయాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. వీరు వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని సర్వే పక్కాగా నిర్వహించాలని అన్నారు.

జలాశయం భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు


హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దృశ్యం

సోమశిల: జలాశయం పరిధిలో స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దశరథరామయ్య అన్నారు. శనివారం జలాశయ పరిధిలోని స్థలాలను సోమశిల డీఈతో కలిసి పరిశీలించారు. రిజర్వాయర్ పరిరక్షణ భూముల్లో ఆక్రమణలు చేపట్టకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఇన్‌చార్జి తహసీల్దారు బాధ్యతల స్వీకరణ


సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట ఇన్‌చార్జి తహసీల్దారుగా నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితం తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన హనోక్ బాబు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో సంగం తహసీల్దార్‌గా పని చేస్తున్న నాగరాజును ఏఎస్‌పేట ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గతంలో మాదిరి కాకుండా ప్రతి అర్జీదారుడి సమస్యను నిశితంగా పరిశీలించి భూ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. డీటీ సతీష్‌కుమార్, ఆర్ఐ రవి తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ


అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు

మర్రిపాడు: మండలంలోని చుంచులూరులో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని శనివారం గ్రామానికి చెందిన యాలగాల మహేష్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి సమీప గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారులు హాజరై భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు.

రైతాంగానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం

- సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలి
- మెట్ట ప్రాంత రైతులకు ఆరుతడి పంటలతో లాభాలు
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


రామన్న చెరువు నుంచి బోగోలు మండలం ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రైతుల సంక్షేమం, ఆదాయ వనరుల పెంపు దిశగా ప్రభుత్వం ప్రతి దశలోనూ అన్నదాతలకు అండగా నిలుస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కప్పరాళ్లతిప్ప, అల్లిమడుగు, తెల్లగుంట, ఉమామహేశ్వరపురం, ఎస్వీపాళెం తదితర గ్రామాల్లోని ఏడు వేల ఎకరాల ఆయకట్టుకు ఉలవపాళ్ల రామన్న చెరువు నుంచి ఎమ్మెల్యే శనివారం సాగునీటిని విడుదల చేశారు. రైతులు నారుమళ్లు వేసుకునేందుకు అదనుదాటి పోతుండడంతో రెండు రోజులు ముందుగానే సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఆయకట్టు రైతులతో పంటలు, సాగునీటి పరిస్థితిపై చర్చించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు నారుమళ్లకు ఇబ్బంది పడుతుండడంతో రెండు రోజులు ముందుగానే సాగునీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించేలా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి సూచించారు. భగవంతుడి దయ వల్ల వర్షాలు పడితే మెట్ట ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురవకపోతే మెట్ట ప్రాంత రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు, నాయకులు మేకల శ్రీనివాసులు, పెళ్లకూరు మోహన్‌రెడ్డి, బొందు రమణయ్య, ఆకుల డేవిడ్‌పాల్, మేకల సాల్మన్‌రాజు, దగదర్తి మండలం ఉలవపాళ్ల మాజీ సర్పంచ్ ఇండ్ల వెంకటసుబ్బయ్య, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు పండిస్తాం

అల్లూరు: ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వాడుకుంటూ ప్రతి ఎకరం పండించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిది అయితే.. ఇప్పుడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే అన్నారు. శనివారం ఎమ్మెల్యే అల్లూరు చెరువు పల్లిపాడు తూము 6వ నంబర్ వద్ద గేట్లు ఎత్తి సాగు నీటిని విడుదల చేశారు. ముందుగా గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో ఈ నెల 20న అల్లూరు మండలంలోని డెల్టా ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేస్తారని నిర్ణయించారని, అల్లూరు ప్రాంతంలో ఇప్పటికే ఆలస్యం అయినందున నారుమడులు పోసుకునేందుకు చెరువులో 6 అడుగుల మట్టం ఉండడంతో నారుమడులకు సాగు నీరును వదలాలని రైతులు కోరారన్నారు. రైతులు త్వరితగతిన నార్లు పోసుకుని వ్యవసాయానికి సిద్ధం కావాలన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో ఈ ఏడాది మొదటి పంట, రెండో పంటకు రికార్డు రేటు పలికి దాదాపు పుట్టికి రూ.20 వేల నుంచి రూ. 30 వేలు పైచిలుకు అమ్మడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కాబట్టి ఈ ఏడాది ఇంకా వానలు పడకపోవడంతో నీరు తక్కుగా ఉన్నందున నాన్ డెల్టా రైతులు ఆలోచించి మెట్ట పైర్లు వేసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. డెల్టా రైతులు కూడా నీటిని పొదుపుగా వాడుకుంటూ పంటలు బాగా పండించుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు పనికట్టుకుని రైతాంగాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరు టౌన్ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, వెస్ట్ సొసైటీ బ్యాంక్ చైర్‌పర్సన్ భక్తవత్సల రెడ్డి, రూరల్ బ్యాంక్ చైర్‌పర్సన్ మేడా శ్రీనివాసుల రెడ్డి, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బాధ్యతగా కుల గణన సర్వే నిర్వహణ

- జెడ్పీ సీఈఓ చిరంజీవి
- డివిజన్ స్థాయి అధికారులకు ఒక్క రోజు శిక్షణ


కుల గణన సర్వే శిక్షణలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

ఆత్మకూరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం కుల గణన సర్వే ప్రారంభించిందని, ఇందుకోసం నియమించిన అధికారులు సిబ్బందితో బాధ్యతగా సర్వే నిర్వహించి నివేదికలను పొందుపరచాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో ఆత్మకూరు ఆర్డీఓ కె మధులతతో కలిసి జెడ్పీ సీఈఓ డివిజన్ స్థాయి అధికారులకు శనివారం కుల గణనపై అవగాహన, సర్వేపై శిక్షణ నిర్వహించారు. చిరంజీవి మాట్లాడుతూ 27వ తేదీ నుంచి వారం రోజుల పాటు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కులగణన సర్వే నిర్వహించాలన్నారు. సర్వే విధి విధానాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఈ సర్వేపై పలువురు అపోహలు పడుతున్నారని ఈ సర్వే ప్రకారం కులధృవీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హతలు లభించవని ఈ విషయం గుర్తెరగాలని అన్నారు. వలంటీర్లకు అందజేసిన ప్రత్యేక యాప్ ద్వారా ఈ సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి అనుమానాలు వచ్చినా అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సర్వే చేయాల్సిన విధానం గురించి బోర్డుపై ప్రదర్శించి చూపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి వై.వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ వినియోగదారులకు లక్కీడిప్


లక్కీడీప్ తీస్తున్న ఆర్టీసీ అధికారులు

కావలి: ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం కావలి కార్గో కేంద్రంలో లక్కీ డిప్ నిర్వహించి ముగ్గురు విజేతలకు చీరలను బహూకరించారు. పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపార ప్రముఖులు ఐవీ సుబ్బారావు లక్కీడిప్ నిర్వహించి విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. అల్లూరుకు చెందిన బి.గురుమూర్తి, పట్టణానికి చెందిన ఎస్ రవికుమార్, ఆర్ మణి బహుమతులు పొందారు. మాసోత్సవాల్లో భాగంగా కనీసం నాలుగు పార్సెళ్లను బుక్ చేసిన వినియోగదారుల పేర్లలో ముగ్గురిని ప్రతి శనివారం లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి విలువైన బహుమతులు అందజేస్తామని డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మేడం రామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, ఉద్యోగ సంఘ నాయకులు ఎస్‌కే ఎం.మస్తాన్, వెంకటేశ్వర్లు, ఎస్‌కే కలాం, కేవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం


7వ వార్డు పరిధిలో ఇంటింటికి వెళ్లి వివరిస్తున్న గృహసారథులు, వలంటీర్లు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 7, 8, 9 వార్డుల్లో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా వార్డు కౌన్సిలర్లు, గృహ సారథులు, వలంటీర్లు శనివారం ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందిన సంక్షేమాలను వివరిస్తున్నారు. గత ప్రభుత్వంలో పూర్తి చేయని హామీలు, జగనన్న ప్రభుత్వం వచ్చాక నెరవేరిన ఎన్నికల హామీలను సరిపోల్చి చూసి సీఎంకు మద్దతు తెలపాలని కోరుతూ వారి అభిప్రాయాన్ని నమోదు చేసుకుంటున్నారు. ప్రజల నుంచి మళ్లీ సీఎం జగనన్నే అంటూ మద్దతు వెల్లువెత్తింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సయ్యద్ నౌషాద్ బేగం, పి రాధికారెడ్డి, కొప్పోలు రమాదేవి, పార్టీ నాయకులు సయ్యద్ జమీర్, చిన్నపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ అకౌంట్ సమస్యపై వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

ఆత్మకూరు: ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకం అమల్లో భాగంగా విద్యార్థులకు నగదు జమ చేసేందుకు తల్లితో కలిసి బ్యాంకుల్లో జాయింట్ అకౌంట్ తెరవాలని చెప్పడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ విద్యార్థి యూనియన్ నేతలు శనివారం ఆత్మకూరు ఆర్డీఓ కె మధులతకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగా జగనన్న విద్యాదీవెన పథకంలో విద్యార్థుల వ్యక్తిగత ఖాతాలకు నగదు జమ చేయాలన్నారు. జాయింట్ అకౌంట్ తెరవాలని చెప్పడంతో రోజుల తరబడి బ్యాంకుల చుట్టూ తల్లులు, విద్యార్థులు తిరగాల్సి వస్తుందన్నారు. 24వ తేదీ చివరి గడువుగా విధించడంతో వారిలో ఆందోళన మొదలైందన్నారు.

సొసైటీ అధ్యక్షుడికి సన్మానం

వరికుంటపాడు: వరికుంటపాడు సొసైటీకి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన గుంటుపల్లి రామాంజనేయులను శనివారం స్థానిక కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి ఇన్‌చార్జ్ దుద్దుకూరి రమేష్‌నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గుంటుపల్లి కృషిని గుర్తించి ఇఫ్కో సంస్థ సొసైటీకి గుర్తింపుగా అవార్డు కూడా అందించిందన్నారు. నానో యూరియా సంస్థ కూడా మరో అవార్డును ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మాల్యాద్రి, హజరత్ పాల్గొన్నారు.

పాఠశాల ఆవాస ప్రాంతాల అభివృద్ధిపై సమావేశం


మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: పాఠశాల ఆవాస ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికల తయారీపై మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంఈఓలు మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాల పరిధిలో హెచ్‌ఎంలు తప్పనిసరిగా గ్రామ సభలు నిర్వహించి పాఠశాల అభివృద్ధికి కావాల్సిన వనరులు, నిధుల సమీకరణపై చర్చించి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. 2024–25, 2025–26 విద్యా సంవత్సరాలకు సంబంధించి ఏఏ వనరులు, ఎంత నిధుల అవసరమో పాఠశాల అభివృద్ధి ఆవాస ప్రాంత ప్రణాళికలో నమోదు చేయాలన్నారు. ఈ నెల 23వ తేదీ లోపు గ్రామ సభలు పూర్తి చేయాలన్నారు.

పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన


మాట్లాడుతున్న ఎంఈఓ బాలకృష్ణారెడ్డి

సోమశిల: పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో జరిగే ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ అధినేత పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు: పట్టణ పరిధిలో మృతి చెందిన నలుగురి అంత్యక్రియలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున శనివారం ఆర్థిక సాయం అందజేశారు. 23వ వార్డు అల్లీపురంలో మృతి చెందిన జి.సుబ్బారాయుడు, అదే వార్డు పరిధిలోని బీసీ కాలనీకి చెందిన సయ్యద్ షకీలా, 19వ వార్డు ఏసీఎస్ఆర్ గిరిజన కాలనీకి చెందిన గంధళ్ల రమణయ్య, ముస్లిం కాలనీకి చెందిన షేక్ మస్తాన్‌బీ మృతి చెందడంతో వారి కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కామక్షయ్యనాయుడు, గంధళ్ల వేణు, కొండా వెంకటేశ్వర్లు, కేవీ శేషారెడ్డి, మెప్మా ఆర్పీలు నాగదేవిక, జబీనా, అభినో రాణి, శాంతి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- సమర్థవంతమైన జగనన్న పాలనకు దర్పణం
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పారదర్శకంగా ఇంటింటికీ సంక్షేమ పథకాల అందుతున్నాయని, సమర్థవంతమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఇది దర్పణమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని 12వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి గత నాలుగున్నర ఏళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తూ పేదలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవిరళ కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన మార్పులను అంతా గమనించాలని, ప్రజలకు అవసరమైన వసతులు, సౌకర్యాలను జగనన్న పాదయాత్ర సమయంలో గమనించి, సీఎం కాగానే అందరికీ అమలు చేశారన్నారు. 29 రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీలు, ముఖ్యమంత్రులు అధికారంలో ఉన్నారని, ఏ రాష్ట్రంలో మన రాష్ట్రం కంటే తక్కువగా నిత్యావసర వస్తువుల ధరలు ఉన్నాయో చెప్పాలన్నారు. చంద్రబాబు కంటే ఐదు రెట్లు అధికంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగాలు కల్పించారని, వేర్వేరు విద్యార్హతలు కలిగిన వారికి కూడా ఉద్యోగాలివ్వబోతున్నారని వివరించారు. చంద్రబాబు, జగనన్న పాలనల మధ్య వ్యత్యాసాలను దగ్గరలో ఉన్న ఆస్పత్రులు, పాఠశాలల అభివృద్ధిని ప్రజలు పరిశీలించి ఆలోచన చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రయోజనం కలిగించేలా సంస్కరణలు చేపట్టి అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టారన్నారు. పేదల అభ్యున్నతికి అసైన్ ల్యాండ్‌పై పూర్తి హక్కులు కలిస్తూ చట్టం తీసుకువచ్చి పేదలను కోటీశ్వరులను చేశారన్నారు. చంద్రబాబుకు ఓటేయ్యమని ఎవరైనా మీ ఇంటికి వస్తే, అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసారో చెప్పాలంటూ ప్రజలు నిలదీయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, అక్కిలగుంట మాల్యాద్రి, చేవూరు కిరణ్‌కుమార్, దావులూరు సన్నీ, కుందుర్తి కామయ్య, చెన్ను ప్రసాద్‌రెడ్డి, మండలి కృష్ణారావు, దేగా రాము, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి

- ఎంపీపీ తూమాటి

చేజర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం చేజర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అందరి సంక్షేమం గురించి ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని, నాడు–నేడు ద్వారా ప్రభుత్వ విద్యను బలోపేతం చేశారన్నారు. చాలా మంది చిన్నారుల ప్రైవేట్ పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారన్నారు. పింఛన్ కోసం ఎవరి దగ్గరకు వెళ్లకుండా అర్హతే ప్రామాణికంగా మన రాష్ట్రంలో అందజేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ప్రణాళిక రూపొందించారన్నారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. అమ్మఒడి, ఆసరా, విద్యాదీవెన, వసతిదీవెన, నేతన్ననేస్తం వంటి అనేక పథకాలను ప్రవేశ పెట్టాడన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సొంత ఇళ్లు ఉండాలనే విధంగా ఇంటి స్థలాలను మంజూరు చేస్తున్నారన్నారు. చేజర్లలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని ఎంపీపీ దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రోడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ బషీర్, సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు ఒంటేరు సుధీర్‌కుమార్‌రెడ్డి, షేక్ రజాక్, మండల ఎస్సీసెల్ నాయకులు వీరాస్వామి సచివాలయ కన్వీనర్ రసూల్, రమేష్, బాలయ్య, పోలయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు


వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థిని

చేజర్ల: 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చేజర్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. హైస్కూల్ ప్రాంగణంలో మారక ద్రవ్యాలు అరికట్టాలనే అంశంపై విద్యార్థులు మాట్లాడారు. విజేతలైన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ పి.కల్పన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హైమావతి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సంగం: సంగం శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పాఠశాల విద్యార్థులకు లైబ్రేరియన్ శ్రీనివాసులరెడ్డి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వాలీబాల్, క్రికెట్ పోటీలను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ అంజయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు పుస్తక పఠనం దోహదం

జలదంకి: విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత పదవులు అదిరోహించాలని జలదంకి గ్రంథాలయ అధికారిణి ఎం.విజయలక్ష్మి సూచించారు. శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జలదంకి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాటల పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 21న బహుమతులు అందజేస్తామన్నారు.

బీసీ హాస్టల్ సందర్శించిన జిల్లా సంక్షేమాధికారి


ఆత్మకూరు బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి వెంకటయ్య

ఆత్మకూరు: పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను జిల్లా బీసీ సంక్షేమాధికారి వై.వెంకటయ్య శనివారం సందర్శించారు. ఏఎస్‌డబ్ల్యూఓ చల్లా శ్రీదేవితో కలిసి ఆయన హాస్టల్‌లో పరిసరాలను పరిశీలించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హాస్టల్ వార్డెన్‌ను సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందుబాటులో ఉండి చదువుపై దృష్టి సారించి, మరింత అంకితభావంతో చూడాలన్నారు. విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. హాస్టల్‌లో వసతులు, సిబ్బంది ప్రవర్తనపై వారిని ప్రశ్నించి అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులు ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకుని ఉత్తమ మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓ నరసింహారెడ్డి, వార్డెన్ మమత, సిబ్బంది పాల్గొన్నారు.